క్లుప్తంగా

వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభించాలి

ముమ్మిడివరం: పోలమ్మ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను త్వరిత గతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధికారులకు సూచించారు. శనివారం ఆయన ఓఎన్‌జీసీ అధికారులతో కలిసి సుమారు రూ.కోటి వ్యయంతో చెరువు చుట్టూ నిర్మించనున్న వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనుల నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్, సుందరీకరణ పనులు త్వరిత గతిని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు తాడి నరసింహరావు, చెల్లి అశోక్, కమిషనర్ పి.రవివర్మ, ఓఎన్‌జీసీ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

డీఐజీ శివరామ్ మృతికి సంతాపం



శివరామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ముమ్మిడివరం: రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ డీఐజీ బి.శివరామ్ ఆకస్మిక మృతికి ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ సుధాకర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. శనివారం కార్యాలయంలో శివరామ్ చిత్ర పటానికి పలువురు ఉద్యోగులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శివరామ్ నిబద్ధతతో కూడిన సేవలందించారన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో కార్యాలయ సిబ్బంది చిలకా దొరబాబు, నూకరత్నం, చిట్టిబాబు, లక్ష్మి, కొండబాబు, లేఖరులు యల్లాప్రగడ జగన్నాధరావు, చవటపల్లి వెంకటేశ్వరరావు, ఏ.గోపాలకృష్ణ, నార్ని బుజ్జి, సలాది చిట్టిబాబు తదితరులున్నారు.

పాఠశాలలో స్వచ్ఛ భారత్



నీలపల్లి జెడ్పీ హైస్కూల్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తాళ్లరేవు: నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సుంకరపాలెం ప్రకాష్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ హెచ్ఎం కె.రాధాకృష్ణ ప్రారంభించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారులు కేవీ రమణ, కె.సత్తిబాబు, కో ఆర్డినేటర్ సత్యనారాయణల పర్యవేక్షణలో పాఠశాల పరిసరాలతో పాటు క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ గంటా గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం 'డయల్ యువర్ కమిషనర్'

అమలాపురం టౌన్: పురపాలక శాఖ రీజనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి సోమవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. ఇందులో భాగంగా కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. 9849905805 నంబరుకు కాల్ చేసి పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి సంబంధించిన సమస్యలను తెలపవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మెప్మా, పారిశుధ్య విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు.

ఎస్ఎస్ఎఫ్ సభ్యత్వ కరపత్రాల ఆవిష్కరణ

ఐ.పోలవరం: హిందూ ధర్మ ప్రచారం చేస్తూ హిందువులలో చైతన్యం పెంచుతున్న ఎస్ఎస్ఎఫ్ సంస్థలో సభ్యులుగా చేరి సంస్థ కార్యకలాపాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముమ్మిడివరం సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బొంతు కనకారావు పిలుపునిచ్చారు. ఐ పోలవరం మండలం కేశనకుర్రు పేర్రాజు చెరువు గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం ఎస్ఎస్ఎఫ్ సంస్థ సమావేశం జరిగింది. హైందవ శంఖారావంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమని సమావేశం అభిప్రాయపడింది.

కమలకు 3న సత్కారం

తాళ్లరేవు: మూడు దశాబ్దాలుగా విశేష సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ఇటీవల అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ అందించిన కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న మెండి కమలను విశ్వజన కళామండలి ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన సత్కరించనున్నట్లు కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు తెలిపారు. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా గల ప్రజా సంఘాల భవనంలో 3వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి కళామండలి జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

బినామీల బాగోతం..!

- బినామీల చేతిలో మున్సిపల్ షాపులు
- ఏళ్లుగా కారుచౌక అద్దెలతో చలామణీ
- ఇతరుల నుంచి వేలాది రూపాయల అద్దె వసూలు
- 135 షాపులకు నెలవారీ ఆదాయం రూ.1.80 లక్షలు మాత్రమే
- ఏటా రూ.80 లక్షల ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



యానాం కొత్త బస్టాండ్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్



మున్సిపాలిటీకి చెందిన లాడ్జి

యానాం: యానాం మున్సిపాలిటీకి చెందిన షాపులను అద్దెకు తీసుకున్న కొంతమంది వ్యక్తులు తిరిగి ఆ షాపులను వేరే వ్యక్తులకు వేలాది రూపాయలకు అద్దెకు ఇచ్చి బినామీలుగా వ్యవహరిస్తుండటంతో లక్షలాది రూపాయల మేర మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతుంది. కారుచౌకగా అద్దెకు తీసుకున్న షాపులను వేరే వ్యక్తులకు లక్షలాది రూపాయల అడ్వాన్సులు తీసుకుంటూ, వేలల్లో అద్దెకు ఇస్తూ మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి నిలువునా గండి కొడుతున్నారు. ఉన్నతాధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నామమాత్రపు అద్దెలు..

నియోజకవర్గ పరిధిలో మున్సిపాలిటీకి చెందిన షాపులు మొత్తం 135 వరకు ఉన్నాయి. పట్టణ పరిధిలో కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, సావిత్రీ నగర్, మార్కెట్ కాంప్లెక్స్, బాలయోగీ కాలనీ, కనకాల పేట, గిరియాంపేట, ఇందిరా గాంధీ మార్కెట్ కాంప్లెక్స్, శివారు గ్రామాలలో ఈ షాపుల నిర్మాణం చేశారు. రెండు లాడ్జీలు సైతం ఉన్నాయి. అయితే అప్పటి నుంచి ఏనాడు ఈ షాపులకు బహిరంగ వేలం నిర్వహించిన పాపాన పోలేదు. దీంతో బినామీలు ఈ షాపులను ఎంచక్కా నిర్వహించుకుంటున్నారు. ముఖ్యంగా రాజకీయ పలుకుబడి, సిఫార్సులతో అతి తక్కువ అద్దెలతో ఈ షాపులను నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది హస్తగతం చేసుకున్నారు. వారి చేతుల్లోనే ఏళ్లుగా ఇవి కొనసాగుతున్నాయి. దీంతో ఏటా సుమారు రూ.80 లక్షల ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయల అద్దెకు షాపులను వేరొకరికి ఇచ్చి అడ్డదారుల్లో ఆదాయం పొందుతున్నారు. 135 షాపుల్లో దాదాపు చాలా షాపులు బినామీల ఆధ్వర్యంలోనే ఉన్నాయి. షాపులను ఖాళీ చేయకుండా వారివద్దే అట్టే పెట్టుకున్నారు.

అగ్రిమెంట్ లేకుండానే..

అమున్సిపల్ షాపులను బినామీలకు ఇవ్వడం వల్ల మున్సిపల్ ఆదాయానికి ఏటా లక్షలాది రూపాయల మేర గండి పడుతోంది. సుమారు 20 ఏళ్ల నుంచి ఇదే తంతు నడుస్తుండటంతో మున్సిపాలిటీ కోట్లాది రూపాయల మేర నష్ట పోతోంది. సంబంధిత వ్యక్తుల నుంచి మున్సిపాలిటీకి అగ్రిమెంట్ లేకపోవడంతో ఇతరుల చేతిలో షాపులు ఉంటున్నాయి. అప్పటి నాయకుల కనుసన్నల్లో మున్సిపల్ షాపుల కేటాయింపులు జరగడంతో అప్పటి నుంచి బినామీలే తిష్ట వేసుకుని ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

లాడ్జీల నిర్వహణలోనూ అలసత్వం

న్యూ బస్టాండ్‌పై భాగంలో ఉన్న మున్సిపల్ లాడ్జీ, పద్మా థియేటర్ ఎదురుగా ఉన్న మున్సిపల్ లాడ్జీలకు గత 5 ఏళ్లుగా బహిరంగ వేలం నిర్వహించడం లేదని, నిర్వహణ సైతం లోపించిందని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తే నెలకు లక్షలాది రూపాయల మేర ఆదాయం వస్తుందని, సిబ్బంది జీత భత్యాల సమస్య సైతం కొంత తీరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విచారణ చేపడతాం

మున్సిపాలిటీకి చెందిన షాపులు ఏళ్ల తరబడి ఇతర వ్యక్తుల చేతుల్లో ఉంటున్నట్లు తెలిసింది. తిరిగి వారు ఇతర వ్యక్తులకు అద్దెకు ఇచ్చినట్లు సమాచారం ఉంది. దీనిపై త్వరలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపడతాం.

– కె రామకృష్ణ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, యానాం

అంతర్వేది గజమాల యాత్ర ఏర్పాట్లపై సమీక్ష



గజమాల యాత్ర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీవో మాధవి, డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి తిరు కల్యాణోత్సవాలకు గజమాల యాత్రను యానాం నుంచి అంతర్వేది వరకూ నిర్వహించడం జరుగుతుందని అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లపై పోలీసు అధికారులు, కమిటీ సభ్యులతో ఆమె శనివారం సమీక్షించారు. పటిష్ట ఏర్పాట్ల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా గజమాల యాత్రను నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో అమలాపురం డీఎస్పీ టీవీఎస్ఎన్ ప్రసాద్, ముమ్మిడివరం, రాజోలు, అమలాపురం సీఐలు ఎం.మోహనకుమార్, పీవీ నరేష్‌కుమార్, పి.వీరబాబు, గజమాల యాత్ర కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

అధికారులకు జేసీ నిషాంతి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: గత ఏడాది ఆగస్టు 23న కొత్తపేట మండలం వానపల్లి గ్రామసభలో సీఎం ఇచ్చిన హామీల మేరకు సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని జేసీ టీ.నిషాంతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన సీఎం హామీల పరిష్కారంపై సమీక్షించారు. పల్లాలమ్మ దేవాలయం వద్ద పార్కు అభివృద్ధి, గృహ నిర్మాణాలు, అంతర్గత, సీసీ రోడ్లు, చెరువుల అభివృద్ధి, గోశాల నిర్మాణం తదితర పనుల పురోగతిని అప్డేట్ చేస్తూ సీఎంవో కార్యాలయానికి నివేదిక పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి రామకృష్ణారెడ్డి, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి నరసింహారావు, జిల్లా అర్థ గణాంక అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడిని ఆదుకోవాలంటూ ఆందోళన



చల్లపల్లిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లిలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడు కుంచే అనిల్‌కుమార్‌కు లారీ యజమాని మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థికంగా సహకరించాలని డిమాండ్ చేస్తూ శనివారం చల్లపల్లి గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై టెంట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ ధర్నాలో చల్లపల్లి గ్రామ పెద్దలు, దళిత నాయకులు పాల్గొని బాధిత యువకుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనిల్‌కు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు సహకరించాలని, ఎస్.యానం–అమలాపురం రహదారిలో లారీల నియంత్రణ చేయాలని, రోడ్డు విస్తీర్ణం పెంచాలని నినాదాలు చేశారు. సీఐ ప్రశాంత్ కుమార్, ఉప్పలగుప్తం తహసీల్దార్ పిఎస్.దివాకర్, ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. అనంతరం లారీ యజమాని వద్ద నుంచి బాధితుడికి వైద్యం నిమిత్తం రూ.3 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. అక్కడ ఉన్న అధికారులు, గ్రామ పెద్దలు బాధితుడి వైద్యం నిమిత్తం రూ.రెండు లక్షలు అందించడంతో ఆందోళన కారులు ధర్నా విరమించారు.

విద్యుత్ ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న సహచర సిబ్బంది

అమలాపురం రూరల్: విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన అమలాపురం మండలంలోని పలువురు ఉద్యోగులకు సత్కారం లభించింది. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆ శాఖ సీఎండీ, ఎస్ఈ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న అవార్డు గ్రహీతలను కామనగరువు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం ఉద్యోగులు సత్కరించారు. అవార్డు గ్రహీతలైన రూరల్ ఏఈ ఎలిపే సుగుణ, లైన్ ఇన్‌స్పెక్టర్ కొప్పిశెట్టి గంగ సాయిబాబా, పేరూరు లైన్ మెన్ బొంతు శ్రీసత్యసాయి, పాలగుమ్మి అసిస్టెంట్ లైన్‌మెన్ వాకాడ జానకి రామారావులను ఉద్యోగులు సత్కరించి అభినందిచారు.

ఓపెన్ హౌస్‌లో వినతుల స్వీకరణ



ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: కోనసీమ రెవెన్యూ కేర్ పేరిట శనివారం నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పలువురు రెవెన్యూ, పౌర సరఫరాలు, సర్వే ఉద్యోగులు తమ సమస్యలను జేసీ టీ.నిషాంతికి అందజేశారు. జిల్లాలో పలువురు వీఆర్వోలు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తమను గ్రేడ్ 2 ను గ్రేడ్ వన్‌గా మార్చాలని కోరారు. వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, మండల తహసీల్దార్లను డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ అధికారులుగా నియమించాలని, గ్రామ సర్వేయర్లు విధి నిర్వహణలో పలు సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి కే.కాశీ విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉప తహసీల్దార్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో ఆదినారాయణమూర్తి సేవలు అభినందనీయం



వీఆర్ఓ దంపతులను సన్మానించిన రెవెన్యూ ఉద్యోగులు

అల్లవరం: ఓడలరేవులో గ్రామ రెవెన్యూ అధికారిగా సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన మెట్ల ఆదినారాయణమూర్తికి రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు అధ్యక్షతన సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణమూర్తి దంపతులను రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్ఓ, వీఆర్ఏలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, డీటీ అడపా సుబ్రహ్మణ్యం, ఆర్ఐ మన్యం, వీఆర్ఓలు, పాల్గొన్నారు.

రీజెన్సీ చైర్మన్‌తో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ భేటీ



రీజెన్సీ చైర్మన్ నాయుడిని కలిసిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ, కాటంశెట్టి

యానాం: రీజెన్సీ సిరామిక్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడిని శనివారం ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్, కాటంశెట్టి రామ్మూర్తి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది మంది కార్మికులకు ఉపాధినిచ్చిన భారీ సిరామిక్స్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించడం ద్వారా యానాం, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. మూతపడిన ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించే దిశలో అడ్డంకులు అధిగ మించడానికి తాము అన్ని విధాలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు.

చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత



కోరంగి అభయారణ్యాన్ని సందర్శించిన విద్యార్థులు

తాళ్లరేవు: చిత్తడి నేలలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో చిత్తడి నేలల సంరక్షణపై అవగాహనా సదస్సు కోరంగి అభయారణ్యంలో జరిగింది. నాలుగు పాఠశాలల నుంచి 123 మంది విద్యార్థులు కోరంగి అభయారణ్యాన్ని సందర్శించారు. చిత్తడి నేలల పరిరక్షణ, మడ అటవీ ప్రాంత పరిరక్షణ ఆవశ్యకతను అధికారులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు పోరు ధర్నాకు అనుమతివ్వండి



ఫీజు పోరు ధర్నాకు అనుమతి కోరుతున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు

వైఎస్సార్ సీపీ నాయకుల వినతి

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 5న అమలాపురం కలెక్టరేట్ వద్ద జరప తలపెట్టిన ఫీజు పోరు ధర్నాకు అనుమతి కోరుతూ ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు శనివారం పోలీసు అధికారులకు సంబంధిత పత్రాలు అందించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌లను కలిసి ధర్నాకు అనుమతి కోరారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకుడు తిక్కా వెంకట ప్రసాద్ తదితరులు ఎస్పీ, డీఎస్పీలను ఎమ్మెల్సీలతో పాటు కలిశారు.

ఫిబ్రవరి 12న అసెంబ్లీ సమావేశం

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 12 నుంచి ప్రారంభమవుతాయని శనివారం స్పీకర్ ఆర్ సెల్వం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం జరిగిందన్నారు. సమావేశాల్లో చర్చించాల్సిన ఎజెండా, సమావేశాలను ఎన్ని రోజులు జరపాలనే విషయాలపై బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో నిర్ణయిస్తామన్నారు. నిబంధనల ప్రకారం అసెంబ్లీ 6నెలలకు ఒక సారైనా సమావేశం కావాల్సి ఉందన్నారు. మార్చి నెలలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెడతామని ఈ మేరకు పుదుచ్చేరి కన్సల్టేటివ్ కమిటీ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ డ్రాఫ్ట్ బడ్జెట్‌ను రూపొందిస్తుందన్నారు. ఈ సమావేశాల నుంచి నేషనల్ ఈ–విధాన్ ప్రాజెక్టును అమలు చేసేందుకు కేంద్రం రూ.8 కోట్లు మంజూరు చేసిందన్నారు. సమావేశాలపై తనకు సమాచారం అందిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.

ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న ఆటో కార్మికులు

అమలాపురం రూరల్: మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలులోనికి తీసుకు రానున్న నేపథ్యంలో ఆటో కార్మికుల జీవనోపాధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానం రూపొందించి ఆదుకోవాలని ఆంధ్రా ఆటోవాలా వర్కర్ల యూనియన్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిబాబు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈదరపల్లి శివాలయం వద్ద ఆటో యూనిట్ ఇన్‌చార్జి ఎలియా అధ్యక్షతన శనివారం ఆటో కార్మికుల సంఘ సమావేశం జరిగింది. అన్ని జిల్లా కేంద్రాల్లో డ్రైవర్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి సుశిక్షితులైన డ్రైవర్లను సిద్ధం చేయాలని కోరారు. శిక్షణ పొందిన డ్రైవర్లకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యా సమస్యల పరిష్కారం కోరుతూ వినతి



డీఈఓ సలీం బాషాకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ముమ్మిడివరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు కనీసం 10 శాతం నిధులు కేటాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఈఓ షేక్ సలీం బాషాకు అందజేశారు. ప్రభుత్వ కళాశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, అధ్యాపక ఖాళీలు, బోధనేతర సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని, జీవో 77ను రద్దు చేయాలని, ఏక పక్షంగా పాఠశాలల తరలింపును ఆపాలని కోరుతూ డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ మున్నేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి యూవీ వెంకటరావు, ఈడీఎస్‌యూ అధ్యక్షుడు బత్తెన ఆజాద్, పినిపే కృష్ణమూర్తి, పీతల రాంబాబు, పంబల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేయొద్దు



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు

అమలాపురం రూరల్: అంతర్వేది కల్యాణ ఉత్సవాలకు స్పెషల్ బస్సుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేయవద్దని అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తిని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఆర్టీసీ డీఎంను కలిసి వినతి పత్రం అందించారు. అమలాపురం నుంచి మలికిపురం వరకు కాకుండా అమలాపురం నుంచి నేరుగా అంతర్వేది వరకు పూర్తి స్థాయిలో బస్సులు నడపాలని, అంతర్వేది ఉత్సవాలకు భక్తుల రద్దీకి తగ్గట్టుగా పూర్తి స్థాయిలో బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర్ ప్రముఖ్ ఉటుకూరి సాంబయ్య, గోళ్ల వీరబాబు, దాట్ల వెంకట సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.